యథేచ్ఛగా.. కబ్జా

- రాత్రికి రాత్రే మట్టి పోసి చదును చేస్తున్న కబ్జారాయులు
- ఇతర అధికారులకు ఫిర్యాదు చేశాం: ఇరిగేషన్ శాఖ
- పరిశీలించి చర్యలు తీసుకుంటాం: రెవెన్యూ అధికారులు

బండ్లగూడ,జనవరి 29: రాత్రికి రాత్రే కబ్జా.. జేసీబీలతో మట్టి పోసి కబ్జారాయులు చదును చేస్తున్నారు. ఏకంగా 18 ఎకరాల చెరువును యథేచ్ఛగా స్వాహా చేస్తున్నా అధికారులు తమకేమి సంబంధం లేదన్నట్టుగా ఉన్నారు. దీంతో చెరువు కబ్జాకు గురవుతున్నదని పలువురు స్థానికులు అధికారులకు ఫిరాదు చేసినా స్పందించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలోకి వెళ్తే..రాజేంద్రనగర్ మండల పరిధిలోని బుంరుక్‌ఉద్దిన్‌దౌలా చెరువులో సర్వే నంబర్ 42,50/ 1,50/6,లో 18ఎకరాల చెరువులో కొన్ని రోజులగా కబ్జాదారులు మట్టి పోసి చదును చేస్తున్నారు.ఈ విషయాన్ని స్థానికులు గమనించి అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇతర అధికారులు సహకరిస్తలేరు

రాజేంద్రనగర్ మండల పరిధిలోని బుంరుక్‌ఉద్దిన్‌దౌలా చెరువులో రాత్రికి రాత్రే మట్టిని పోస్తూ చదును చేస్తున్న వారిని తాము వారించేందుకు వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఇరిగేషన్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాం. అయినా వారు స్పందించడం లేదు.

–ఏఈ విశ్వం, ఇరిగేషన్ శాఖ

చెరువులో మట్టి పోసి చదును చేస్తున్న కబ్జాదారులు

చర్యలు తీసుకుంటాం

బుంరుక్‌ఉద్దిన్‌దౌలా చెరువు కబ్జాకు సంబంధించి తాము ఇదివరకే వారిని అడ్డుకున్నాం. కాని కబ్జాదారులు సెలవు రోజులు,రాత్రికి రాత్రే మట్టిని పోసి చదును చేస్తున్నారు. వారు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నారు. అయినా ఆ స్థలం చెరువుది కావున దాని ఎవరు కూడా కబ్జా చేయడానికి వీలులేదు. మరోసారి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

–వేణుగోపాల్, రాజేంద్రనగర్ తహసీల్దార్

ప్రభుత్వ భూమిని కాపాడాలి

ప్రజావాణిలో కలెక్టర్ శశాంక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేషన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్

బండ్లగూడ, జనవరి 29 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో వెలుస్తున్న అక్రమ వెంచర్లను అడ్డుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్‌కు బీజేఎంసీ కార్పొరేటర్ సాగర్ గౌడ్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సికిందర్‌గూడలోని సర్వే నంబర్ 9, 14, 15, 16, 19లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లు వెలిశాయన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

డీసీ సేవా ఎస్లావత్

ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

జూబ్లీహిల్స్ : సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీ సేవా ఎస్లావత్ పేర్కొన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ విభాగాల అధికారులతో కలిసి పాల్గొన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా 16న దేశవ్యాప్తంగా సమ్మె

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీబాయికు సమ్మె నోటీసును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 29: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు దేశవ్యాప్తంగా సమ్మెను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి కృష్ణలు వెల్లడించారు. సోమవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీబాయికు ఫిబ్రవరి 16న జరగబోయే సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, రైతు, వ్యవసాయ కూలీలు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జెయింట్ ఫారం ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీలత, జ్యోతి, సుకన్య, శోభ, రుక్మిణి, రాణి, శోభారాణి, మీనా తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వోకు సమ్మె నోటీసు అందజేత...

తెలంగాణ ఆశ వర్కర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వోకు ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జి.కవిత ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు.

గుర్తింపు కార్డులు తప్పక ఉండాలి

జూబ్లీహిల్స్,జనవరి 29: వీధి వ్యాపారులు విధిగా జీహెచ్‌ఎంసీ గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని డీసీ సేవా ఎస్లావత్ పేర్కొన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో వీధి వ్యాపారుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట కిషన్ రావు, టౌన్ ప్లానింగ్ , ట్రాఫిక్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కాటేదాన్ క్లాత్ మార్కెట్ అసోసియేషన్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 29: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అసోసియేషన్లు కమిటీలను ఏర్పాటు చేసుకోవడం హర్షనీయమని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాటేదాన్ క్లాత్ మార్కెట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, యజమానులు సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాటేదాన్ క్లాత్ మార్కెట్‌కు నియోజకవర్గం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం వినియోగదారులు వచ్చి తమకు కావాల్సిన వస్త్రాలను కొనుగోలు చేసుకుంటారన్నారు. ఈ మార్కెట్‌కు ప్రజల్లో మంచి డిమాండ్ ఉందన్నారు.

పీఎఫ్‌లో సమస్యల పరిష్కారం కోసమే.. నిధి ఆప్‌కే నికట్

వెంకటరమణ కాలనీలో నిధి ఆప్‌కే నికట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సౌరబ్ జగతి

బంజారాహిల్స్,జనవరి 29: ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన సందేహాలు నివృత్తి చేయడంతో పాటు సమస్యలను పరిష్కరించేందుకు ఈపీఎఫ్‌వో ఆధ్వర్యంలో నెలవారీగా ఏర్పాటు చేసే 'నిధి ఆప్‌కే నికట్' జిల్లా స్థాయి అవుట్‌రీచ్ కార్యక్రమం సోమవారం వెంకటరమణ కాలనీలోని సరస్వతి విద్యా మందిర్‌లో నిర్వహించారు. రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లు సౌరబ్ జగతి, రవితేజ్‌తో పాటు ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈపీఎఫ్ ఖాతాదారులకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేర్లలో తప్పులు సరిచేసుకోవడం, డెత్ క్లెయిమ్స్‌లో జాప్యం తదితర సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించిన అధికారులు వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ సౌరబ్ జగతి మాట్లాడుతూ.. నిధి ఆప్‌కే నికట్ పేరుతో ప్రతినెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఇందిర, వాసు,వెంకట్‌తో పాటు సరస్వతి విద్యాపీఠం ట్రస్ట్ కార్యదర్శి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

జూబ్లీహిల్స్,జనవరి 29 : జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఖైరతాబాద్‌లోని రాజ్‌భవన్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్టీఓ రామచందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంవీఐ లు శ్రీనుబాబు, మల్లికార్జున్, సాయికృష్ణ, ఏఎంవీఐ రుబీనా, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

కాటేదాన్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 29: ఉన్నత పౌరులుగా ఎదిగేందుకు విద్యార్థులు బాగా చదువుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పేద పిల్లల అభ్యున్నతికి, వారి భవిష్యత్ కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత చదువులు చదివించడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ లక్ష్మీబాయి, పద్మజ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘుపతి, ఉపాధ్యాయులు మాణిక్యం, పాండుయాదవ్, శేఖర్ రెడ్డి, మధుసుదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాంప్‌లు .. భవిష్యత్‌కు పునాది

మహవీర్ కళాశాలలో నిర్వహించిన ఐబీఎం పరిశోధన క్యాంప్‌లో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 29: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారి భవిష్యత్‌కు తోడ్పాటును అందించేందుకు కృషి చేస్తున్నట్లు మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో ఐబీఎం పరిశోధన క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ఉద్యోగ అవకాశాలను పొందేందుకు ఇలాంటి క్యాంప్‌లు దోహదపడుతాయన్నారు. ఐబీఎం కంపెనీ ద్వారా 1800 కోర్సులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, సంయుక్త కార్యదర్శి సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్‌డీ మల్లారెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ వి.వి.ప్రతిభాభారతి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎం.చెన్నయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఎంపీపీ జయమ్మకు వినతి పత్రం అందజేస్తున్న జూకల్ ఎంపీటీసీ బుక్క ప్రవీణ్‌కుమార్

శంషాబాద్ రూరల్, జనవరి 29 : గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ సోమవారం జూకల్ ఎంపీటీసీ బుక్క ప్రవీణ్‌కుమార్ ఎంపీపీ జయమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం మండల పరిషత్ నుంచి నిధులు కేటాయిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.

సొంతజోన్లకు బదిలీ చేయాలి

స్టాఫ్ నర్సుల డిమాండ్

జీవో నంబర్ 317లో బదిలీ అయిన తమకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరేందుకు వచ్చిన స్టాఫ్ నర్సులు

బంజారాహిల్స్,జనవరి 29: జీవో నంబర్ 317లో భాగంగా సుదూర ప్రాంతాలకు కేటాయించిన తమను సొంత జోన్లకు బదిలీ చేసేందుకు చర్యలు తీసుకోవాలంటూ పలు జిల్లాలకు చెందిన స్టాఫ్ నర్సులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్దకు వచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటివరకు ప్రభుత్వ పరంగా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జీవో నంబర్ 317లో జరిగిన తప్పులను సరిదిద్దుతామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, కొత్తగా నియామకాలు జరగడానికి ముందే తమ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని సీఎం కార్యాలయం అధికారులకు అందజేశారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

బంజారాహిల్స్, జనవరి 29: వివిధ కారణాలతో మృతి చెందిన వీఆర్‌ఏల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల్లో భాగంగా ఉద్యోగాలు ఇవ్వాలని పలువురు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వీఆర్‌ఏల కుటుంబ సభ్యులు కోరారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద సీఎం కార్యాలయం అధికారులకు వినతి పత్రాన్ని అందజేసినట్లు వీఆర్‌ఏల కుటుంబ సభ్యులు మల్లేష్, సతీష్ పవార్, మోహన్ తదితరులు పేర్కొన్నారు.

కార్యకర్తల పోరాటంతోనే విజయం

బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, జనవరి 29: బీఆర్ఎస్ కార్యకర్తల పోరాట పటిమతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలతోనే గ్రేటర్ పరిధిలో అన్ని సీట్లను పార్టీ గెలుచుకుందని, కార్యకర్తల కష్టాన్ని ఎప్పటికీ మర్చిపోమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితర నేతలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ..గత అసెంబ్లీ ఎన్నికలలో నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని, వారు ఎవరికి లొంగకుండా తన గెలుపుకోసం శ్రమించారన్నారు. కార్యకర్తల రుణం ఎన్నటికీ తీర్చుకోలేనని, ఎలాంటి కష్టం వచ్చినా తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే ప్రజల తరపున పోరాటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, సంగీతయాదవ్, మహాలక్ష్మీ గౌడ్, మాజీ కార్పొరేటర్లు మహేష్ యాదవ్, భారతీనాయక్, కాజా సూర్యనారాయణతో పాటు వివిధ డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నేతలు, వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

రాజ్‌భవన్ విద్యార్థులకు యువ ఉత్పాదకత శిక్షణ

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ, ఉపాధ్యాయులు

ఖైరతాబాద్, జనవరి 29 : టై హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థులకు యువ ఉత్పాదకత శిక్షణ ఇచ్చారు. పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు ఎంపిక కాగా, పది ఆదివారాలు వారికి వ్యాపారానికి కావాల్సిన మంచి ఆలోచన, పెట్టుబడి, శ్రమ, మార్కెటింగ్, లాభనష్టాల అంచన తదితర ఉత్పాదక అంశాలను వివరించారు. గచ్చిబౌలిలోని ఓ హోటల్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో ప్రతిభ కనబర్చిన గౌతం, చాతుర్య, అక్షరశ్రీ, చిరుశ్రితలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరు ఈ ఏడాది జూన్ నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్ కరుణశ్రీ, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కంటోన్మెంట్, జనవరి 29 : విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలని, చిన్నప్పటి నుంచే ఆత్మస్థైర్యంతో సహా, వేదికలపైన భయం పోగొట్టడానికి నాలుగేళ్లుగా నారాయణ విద్యాసంస్థల ఉపాధ్యాయులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని నారాయణ విద్యాలయాల జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని 7 నారాయణ పాఠశాలలకు సంబంధించిన ఇండియన్ మాస్టర్స్ ఒరిటర్ (వేదిక) పేరిట బోయిన్‌పల్లిలోని నారాయణ పాఠశాలలో సోమవారం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి గోపాల్ రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు , స్పీచ్ , పాటలు , సంగీతం కార్యక్రమాలలో విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, భార్గవి, అడ్మినిస్ట్రేషన్ గంగాధర్, షఫీతో పాటు వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు అపరంజని, హేమలత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఇండియన్ మాస్టర్స్ ఒరిట్ కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

అదిరేటి స్టెప్పు మేమేస్తే..

జూబ్లీహిల్స్,జనవరి 29: యూసుఫ్‌గూడలోని మహాత్మా గాంధీ మెమోరియల్ ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ,ఎస్ఎస్ఈ) పాఠశాల వార్షికోత్సవాన్ని నగరంలోని హరిహర కళాభవన్‌లో సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పాత తరం అలనాటి పాటల నుంచి నేటితరం పాటలకు అనుగుణంగా చిన్నారులు స్టెప్పులేసి అదరగొట్టారు.

రేషన్ దందా చేస్తే.. పీడీ యాక్టులు

శంషాబాద్ రూరల్, జనవరి 29 : రేషన్ బియాన్ని అక్రమంగా దందా చేసేవారిపై పీడీ యాక్టులు నమోదు చేస్తామని పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. సోమవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద పట్టుబడిన బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ మండలంలోని వివిధ రైస్ మిల్లుల యాజమానులు రేషన్ దందా చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో రైస్ మిల్లులను తనిఖీ చేస్తామని వివరించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్,జనవరి 29: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈ.టీ. నరసింహ డిమాండ్ చేశారు.సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా కట్టబెడుతుందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి,ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోదీ మోసం చేశారని ఆరోపించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎర్రగడ్డ/మైలార్‌దేవ్‌పల్లి: జనవరి 29: ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బోరబండ ప్రాంతంలోని స్వరాజ్‌నగర్, సైట్–2 కాలనీ, సాయిబాబానగర్, పద్మావతినగర్, అల్లాపూర్, బంజారానగర్ ఏరియాలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్సీఆర్ హిల్స్, నవభారత్ నగర్, గుట్టల బేగంపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలిపారు.

మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో

మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరమ్మతుల నిమిత్తం కోత విధిస్తున్నామన్నారు. మైలార్‌దేవ్‌పల్లి గ్రామం, మొగల్ కాలనీ, ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ, టాటానగర్, సుభాన్ కాలనీ ఫేస్–1,2, ఐడీఏ మైలార్‌దేవ్‌పల్లి, ఆలీనగర్, గుమ్మడి కృష్ణనగర్, కింగ్స్ అవెన్యూ కాలనీ, రాజీవ్ గాంధీనగర్, పటేల్‌నగర్, లక్ష్మీగూడ, రాజీవ్‌గృహకల్ప, హౌసింగ్ బోర్డు కాలనీ, రోషన్ కాలనీ, షమీ కాలనీ, దుర్గానగర్, గణేష్‌నగర్, స్వప్న థియేటర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.